క్లుప్తంగా

విద్యుత్ సమస్య పరిష్కారం



లైన్‌ను బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కొడకండ్ల: 'ఎండుతున్న పొలాలు' శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించి కరెంట్ సరఫరా పునరుద్ధరించి సమస్యను పరిష్కరించడంతో రైతులు హర్షం వెలిబుచ్చారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో వారం రోజులుగా ఏడునూతుల గ్రామ శివారులోని కర్లాలకుంట సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన లైన్‌లో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయి కరెంట్ సరఫరా లేక 20 ఎకరాలకు పైగా వరి పొలాలు ఎండిపోతున్న దుస్థితి, రైతుల ఆవేదనను సాక్షిలో ప్రచురించగా అధికారులు స్పందించారు. వెంటనే విద్యుత్ సిబ్బంది రెండు స్తంభాలకు లైన్ గుంజి కరెంటు ఇవ్వడంతో రైతులు పొలాలకు నీరు అందించుకున్నారు. తమ గోడును ప్రచురించడం, సమస్య పరిష్కారం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

మంత్రిని కలిసిన ఝాన్సీరెడ్డి



పాలకుర్తి: ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటీ రంగ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు.

పద్మ విభూషణ్ అవార్డు గ్రహీతకు సత్కారం



నాగేశ్వర్‌రావుతో మల్లారెడ్డి

జనగామ: కేంద్ర ప్రభుత్వం అందించిన పద్మవిభూషణ్ అవార్డు అందుకున్న ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రావును కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఏసీఎస్ డైరెక్టర్, ఎన్ఆర్ఐ రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల మల్లారెడ్డి మంగళవారం కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట రెడ్డి పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణకు..



లింగాలఘణపురం: పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను మంగళవారం హైదరాబాద్‌లో రజక రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏదునూరి వీరయ్య, రాష్ట్ర కోకన్వీనర్ సంతోష్, టీఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి, ఉపాధ్యక్షుడు గణేష్, జిల్లా అధ్యక్షుడు నరేశ్, ప్రధాన కార్యదర్శి రాములు పాల్గొన్నారు.

హర్షం

జనగామ రూరల్: కొన్ని నెలలుగా వేతనాలు రాక ఇబ్బందిపడుతున్న అర్చకులకు ప్రభుత్వం బకాయిలు విడుదల చేయడంతో అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు త్రిపురారి మనోహర్ శర్మ, కార్యదర్శి యల్లంభట్ల కరుణాకర్ శర్మ లు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర సలహాదారు వేణుగోపాల్‌రావు, కమిషనర్ శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మకు వారు కృతజ్ఞత తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

జఫర్‌గఢ్ : మండలంలోని తిడుగు గ్రామానికి చెందిన తీగల రాజుకు గల ద్విచక్రవాహనం సోమవారం రాత్రి చోరీకి గురైనట్లు ఎస్సై రామ్ చరణ్ తెలిపారు. మంగళవారం ఎస్సై మాట్లాడుతూ.. రాజు వ్యవసాయ పనుల కోసం కొనుగోలు చేసిన రూ.20 వేల విలువైన ద్విచక్ర వాహనాన్ని తన ఇంటి ఎదుట పార్కింగ్ చేసి పడుకున్నాడు. తెల్లవారుజామున లేచి చూసే సరికి బైక్ కనిపించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను దొంగలించినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కమ్ముకున్న పొగ మంచు

పొగ మంచు తెరల చాటు నుంచి ఉదయించే బానుడు.. చిరు జల్లుల మంచు తుంపర్లు.. ప్రకృతి ప్రేమికులను ఆహ్లాదంలో ముంచేస్తోంది. గజగజ వణికించే చలిలో వేడివేడి టీ తాగుతూ ఆకాశాన్ని కప్పేసిన పొగమంచును ఆస్వాదిస్తున్నారు. జిల్లా కేంద్రంలో వారం రోజులుగా తెల్లవారు జాము 3.30 నుంచి ఉదయం 7 గంటల వరకు పొగమంచు రహదారులను పూర్తిగా కప్పేస్తోంది. బతుకుదెరువు కోసం రోడ్డెక్కే చిరు వ్యాపారులు, కార్మికులు కొందరైతే... ఆరోగ్యం కోసం నడక సాగించే వాకర్లు మరికొందరు. ఒకరినొకరు కనిపించనంత పొగమంచు కమ్ముకుంటోంది. వాహనాల హెడ్ లైట్లు ఉంటేనే ముందుకు కదిలే పరిస్థితి. సూర్యాపేట, హైదరాబాద్, హనుమకొండ, సిద్దిపేట రోడ్డు వైపు మంచుకురిసే వేళలో పట్టణ ప్రజలు ఎంజాయ్ చేస్తున్నారు.

-జనగామ

బతుకమ్మ కుంటలో వాకర్స్ →





జనగామ జంక్షన్‌లో ఫౌంటేయిన్, రాణి రుద్రమదేవి విగ్రహాన్ని కమ్మేసిన పొగమంచు

సేంద్రియ ఎరువులతో అధిక లాభాలు



మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ సుభాన్

నర్మెట: సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరగడంతోపాటు సాగు వ్యయం తగ్గుతుందని స్పిక్ గ్రీన్ స్టార్ వరంగల్ రీజినల్ మేనేజర్ సుభాన్, సేల్స్ మేనేజర్ తిరుమల్‌రావు అన్నారు. వెల్దండలో సోమవారం ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో పాల్గొన్న వారు మాట్లాడారు. మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకంతో భూసారం క్షీణిస్తుందని దిగుబడులు తగ్గుతాయని పర్యావరణంపై అనేక దుష్పలితాలు కలుగుతాయని తెలిపారు. స్పిక్ -గ్రీన్ స్టార్ అందిస్తున్న ఎంపవర్, సైటోజ్, ఆర్గానిక్ పొటాష్, సీఎంఎస్ కీర్తి వాడకంతో మంచిదిగుబడులను సాధించ వచ్చని తెలిపారు. రైతులు క్రమంగా సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ కన్నయ్య, జూనియర్ డెవలప్‌మెంట్ అధికారి అరుణ్, రైతులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

జఫర్‌గఢ్: ఫిబ్రవరి 4వ తేదీన జనగామ పట్టణంలో నిర్వహించనున్న సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని తమ్మడపల్లి (ఐ) గ్రామంలో గ్రామ కార్యదర్శి మంద బుచ్చయ్య అధ్యక్షతన నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల పక్షాన సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అనేక పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. సాయిలు, వెంకటయ్య, సత్తయ్య, యాకయ్య, రాజయ్య, రాములు, యాదయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



నినాదాలు చేస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాలను కలుపుతూ స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు చేపట్టారు. పార్టీ రాష్ట్ర నాయకుడు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమంలో ముందుగా బాణాసంచాలు కాల్చారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కావ్య ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేసి పార్టీ శ్రేణులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జై కాంగ్రెస్, జైజై కడియం అంటూ నినాదాలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య, పార్టీ రాష్ట్ర నాయకుడు బెలిదె వెంకన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, నాయకులు పోగుల సారంగపాణి, నీల గట్టయ్య, బూర్ల శంకర్, అంబటి కిషన్‌రాజ్, కొలిపాక సతీష్, సింగపురం వెంకటయ్య, తెల్లాకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కమిషనర్‌గా సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించిన కృష్ణారెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘన్‌పూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాలు అందించి శాలువాతో సన్మానించి స్వీట్లు అందించారు.

నేడు 'భూభారతి'పై సదస్సు



మాట్లాడుతున్న సురేష్‌నాయక్

కొడకండ్ల: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టంపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించేందుకోసం ఈనెల 29వ తేదీ(బుధవారం)న పాలకుర్తిలో నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి రైతుల పాలిట శాపంలా మారి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, భూమి రికార్డుల్లో నమోదు కాక రెవెన్యూ కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ధరణిని రద్దు చేసి భూ ప్రక్షాళన చేసి రైతులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి నూతన చట్టాన్ని తీసుకొచ్చారని, ఈ చట్టంపై అవగాహన కల్పించేందు కోసం నిర్వహించే సదస్సుకు మండలం నుంచి రైతులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, మార్కెట్ డైరెక్టర్లు క్రాంతికుమార్, ఈదయ్య, వెంకన్న, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



జనగామ రూరల్: సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఏఎంసీ చైర్మన్ శివరాజ్ తదితరులు



బచ్చన్నపేటలో..



పాలకుర్తి టౌన్: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: తానేదార్‌పల్లిలో..

జనగామ రూరల్/కొడకండ్ల/బచ్చన్నపేట/దేవరుప్పుల/స్టేషన్‌ఘన్‌పూర్/పాలకుర్తిటౌన్: ప్రజలకిచ్చిన హామీలు నేరవేర్చడం కాంగ్రెస్ నైజమని, నిరుపేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. నాలుగు గ్యారంటీల అమలును హర్షిస్తూ జిల్లా వ్యాప్తంగా మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కాసారపు ధర్మారెడ్డి, బెలిదె వెంకన్నగుప్తా, రాపాక సత్యనారాయణ, బనుక శివరాజ్, లావుడి మంజుల, జూలుకుంట్ల లావణ్య, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, గిరగాని కుమారస్వామి, ధరావత్ సురేష్‌నాయక్, లింగాల నర్సిరెడ్డి, నూకల బాల్‌రెడ్డి, దాసరి శేఖర్, బోజియ నాయక్ పాల్గొన్నారు.

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలి

జనగామ రూరల్: పట్టణంలోని హైదరాబాద్ బైపాస్ రోడ్డుపై అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యేలు కృషి చేయాలని ఆవాజ్ సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ అజారుద్దీన్ కోరారు. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహా దీక్షలు సోమవారం నాటికి ఐదోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాలకులు, అధికారులు ప్రజా సమస్యలు పట్టించుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తాం అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోతుకునూరి ఉపేందర్, కల్యాణ లింగం, బూడిద ప్రశాంత్, ధరావత్ మహేందర్, భిక్షపతి, కంది పుష్ప, నాగమణి, స్వామి, మాలోత్ వసంత, ఎండీ మహబూబ్ అలీ, వసంత, నీలిమ, రమాదేవి, మమత ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'శ్రీహరిని విమర్శిస్తే గ్రామాల్లో తిరగనివ్వం'



రఘునాథపల్లి: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా అవిశ్రాంతిగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపణలు చేయడం మానుకోవాలని, అలాగే వ్యవహరిస్తే గ్రామాల్లో తిరగనివ్వమని మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పుల్ల విక్రంగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని బానాజీపేటలో ఆయన యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. తాటికొండ రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అంతా అవినీతిమయమని.. చివరకు ఆ పార్టీ కార్యకర్తలకు ఇచ్చిన పనులకు కమీషన్లు దండుకున్నాడని ఆరోపించారు. నిరంతరం అభివృద్ధి కోసం పని చేస్తున్న ఎమ్మెల్యేపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు కొమ్మగల్ల రాకేష్, యూత్ నాయకులు చిట్ల దయాకర్, రాపాక విజయ్, కన్న దుర్గాప్రసాద్, కన్న మనోహర్, చాట్ల దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



ఆటో డ్రైవర్, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు పోలీసులు రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహన కల్పించారు. పాలకుర్తిలోని పాఠశాలకు కొండాపూర్ నుంచి సామర్థ్యానికి మించి 18 మంది విద్యార్థులను తీసుకొస్తున్న ఆటోను ఆపి డ్రైవర్‌కు సీఐ మహేందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఆటోలో తీసుకెళ్లడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో తీసుకెళ్లకూడదని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసులు సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో ఆత్మస్థైర్యం పెంపు



క్రీడాకారులతో ఎస్సై చెన్నకేశవులు

ఎస్సై చెన్నకేశవులు

జనగామ రూరల్: క్రీడలతో యువతలో ఆత్మస్థైర్యం, ధృడసంకల్పం పెంపొందుతుందని ఎస్సై చెన్నకేశవులు అన్నారు. పట్టణంలో ప్రిస్టెన్ మైదానంలో ఖేలో భారత్-2025 క్రీడోత్సవాల్లో భాగంగా మంగళవారం కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించి దేశ, రాష్ట్ర కీర్తిని చాటాలని అన్నారు. రిటైర్డ్ కల్నల్ డాక్టర్ భిక్షపతి మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడకుండా క్రీడల్లో రాణించి ఆర్మీ, పోలీసు శాఖలో ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేందర్, ఉమర్, గుంటుపల్లి కార్తీక్, నితీష్, గణేష్, సాయి, శ్రవణ్, దుర్గా ప్రసాద్, ప్రేమ్,తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూదొందే'



రాజును సన్మానిస్తున్న శ్రీనివాస్, రాజశేఖర్

దేవరుప్పుల: హామీల అమలులో బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూదొందే అని బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇటీవల పార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన పెదగొని రాజును వారు సన్మానించి మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు హామీలను ఇచ్చి విస్మరించాయని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, మాజీ మండల అధ్యక్షుడు సత్తయ్య, మండల ఉపాధ్యక్షుడు మహేష్, భాస్కర్, శ్రీనివాస్, నాగేంద్ర, పెద్ద ఉప్పల్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం నాగేశ్వర్‌రావు

ఏపీఎం నాగేశ్వర్‌రావు

బచ్చన్నపేట: మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ వారు స్వయం ఉపాధి పొందేలా వీఓఏలు కృషి చేయాలని ఐకేపీ ఏపీఎం నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో వీఓఏలకు సమైఖ్య సంఘాల బైలా పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు సంఘాల్లో చేరి పొదుపు అలవాటు చేసుకుని అభివృద్ధి పనులకు రుణాలను పొందాలని సూచించారు. తీసుకున్న రుణ వాయిదాలను సకాలంలో చెల్లించాలని అన్నారు. సీసీలు నర్సింహులు, విజయలక్ష్మి, తిరుమల, మండల సమైఖ్య అధ్యక్షురాలు విజయశాంతి, కార్యదర్శి లావణ్య, కోశాధికారి మంజుల పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కదలాలి'



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొడకండ్ల: సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధన, గౌడ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం ఐకమత్యంగా ముందుకు సాగాలని గౌడజన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తాళ్ల సోమనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సర్మెట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయంలో సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు క్రాంతికుమార్, సోమయ్య, వెంకన్న, శేఖర్, శ్రీశైలం, సైదులు, మహేందర్, నరేష్, సతీష్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

కొడకండ్ల: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై చింత రాజు హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై విలేకరులతో మాట్లాడారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుపడితే జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. వాహనాల తనిఖీ చేసే క్రమంలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన బోనాల యాకయ్య డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్‌లో పట్టుపడగా అతనికి రూ.1,500 జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష కోర్టు విధించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

అద్దంకి దయాకర్‌ను కలిసిన తాటి కుమార్

జనగామ: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌ను మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జ్ తాటికుమార్ మంగళవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చించి వచ్చే నెల జనగామ పొట్టిగుట్ట మైసమ్మ ఆలయం వద్ద జరిగే వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానించినట్లు చెప్పారు.

కరపత్రాల ఆవిష్కరణ

లింగాలఘణపురం: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 31వ తేదీన హైదరాబాద్‌లోని అంజయ్ భవన్‌లో నిర్వహించే సంఘం సభ కరపత్రాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ మేరకు సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు అంజయ్య ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని భవన నిర్మాణ రంగ కార్మికులంతా హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. భిక్షపతి, ఆంజనేయులు, నర్సయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దివ్యాంగుడికి చేయూత



చిల్పూరు: మండలంలోని గార్లగడ్డతండాకు చెందిన దివ్యాంగుడు బాధావత్ రాజుకు చిల్పూరు ఆలయ చైర్మన్ చేయూతనందించారు. ఈ నెల 26వ తేదీన గ్రామంలో నిర్వహించిన ప్రభుత్వ పథకాల ప్రారంభానికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ శ్రీధర్‌రావును బొట్టు జాన్సన్ ఆధ్వర్యంలో రాజు కలిసి త్రీవీలర్ అందజేయాలని కోరాడు. స్పందించిన శ్రీధర్‌రావు మంగళవారం త్రీవీలర్‌ను అందజేశారు. ఐలపాక మనోజ్, దార అశోక్ పాల్, సంజీవ, భీముడు, యాదగిరి పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని సెర్ప్ భవనంలో మండల రచన మహిళా మండలి నూతన అడ్‌హక్ కమిటీని సంఘం సభ్యులు మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా మిన్నాలపురం విజయశాంతి, కార్యదర్శిగా లావణ్య, కోశాధికారిగా మంజుల, ఉపాధ్యక్షురాలుగా లలిత, సహాయ కార్యదర్శిగా కరీమున్నీసాబేగంలు ఎన్నికయ్యారు.

మాష్టిన్ కుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యవర్గం..

దేవరుప్పుల: మాష్టిన్ కుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యవర్గ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులుగా బత్తిని భాస్కర్, బత్తిని నాగరాజు ఎన్నికైనట్టు ఆ విభాగం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగెల్లి కిష్టయ్య తెలిపారు. అలాగే ఉపాధ్యక్షుడిగా బత్తిని చిన్న పరశురాం, కార్యవర్గ సభ్యుడిగా నాగెల్లి నర్సయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగేల్లి పెంటయ్య,రాష్ట్ర నాయకులు బత్తిని గోవింద్ , హరికృష్ణ, నర్సయ్య, వీరయ్య, పెద్ద పరుశరాములు, మస్తాన్ పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

జనగామ రూరల్ : అన్యమతాన్ని ప్రోత్సహిస్తున్న ఓ స్కూల్‌పై వెంటనే చర్య తీసుకోవాలని వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో ఓ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా క్రైస్తవ మతానికి సంబంధించిన ప్రార్థన చేయిస్తూ ఇతర మత విద్యార్థుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని వారు ఆరోపించారు. మత ప్రచారాన్ని ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యంపై విచారణ చేపట్టి చర్య తీసుకోవాలని కోరారు. కొండా కిరణ్, బిట్ల నాగేంద్రబాబు, పవన్, సందీప్, అజయ్, ఇమ్రాన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పది జీపీఏ సాధించాలి

బచ్చన్నపేట: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో పదికి పది జీపీఏ సాధించాలని కల్నల్ నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సెకండరీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పలు అంశాలపై ఆయన వివరించారు. పది జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.10 వేల బహుమతిని అందిస్తానని, ఎడ్యుకేషన్ టూర్‌కు కూడా తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. టీచర్లు గట్టు రామచంద్రం, గొట్టె కనుకయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదం.. రోడ్డు నిర్మాణ పనులు

- అడ్డంగా గొయ్యి తవ్విన నాయకుడు
- ధర్మతండావాసులకు దారి కరువు



కోలుకొండ శివారు ధర్మతండా రోడ్డు పనులకు అడ్డంగా నాటిన కనీలు, తీసిన గొయ్యి

దేవరుప్పుల : మండలంలోని కోలుకొండ రెవెన్యూ పరిధిలోని ధర్మతండాకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు వివాదాస్పదంగా మారాయి. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా నిర్మాణ పనులకు బ్రేక్ పడి ఇటీవల పనులు మొదలయ్యాయి. కాగా తమ కుటుంబానికి చెందిన సొంత స్థలం నుంచి రోడ్డు వేయొద్దంటూ రామచంద్రాపురం గ్రామానికి చెందిన రైతు, కాంగ్రెస్ నాయకుడు కేత్‌వాల్ నర్సయ్య అడ్డుకుని రోడ్డుకు అడ్డంగా ట్రాక్టర్‌తో గొయ్యి తీసి కనీస అడ్డుపెట్టి కంపవేశాడు. దీంతో ధర్మతండాతోపాటు కోలుకొండ, రామచంద్రాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న విషయమై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా గొయ్యి తీసిన విషయం తెలియని అదే తండాకు చెందిన నర్సింహనాయక్ రాత్రి ప్రమాదవశాత్తు గొయ్యిలో పడి గాయాల పాలై ఆస్పత్రిలో చేరాడు.